
ప్రజాశక్తి
శనివారం 23 నవంబర్ 2024
5
పార్వతీపురం మన్యం




26 నుంచి వికలాంగుల ఉపకరణాల గుర్తింపు శిబిరాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

వికలాంగులు, వయోవద్ధుల సహాయ ఉపకరణాలు గుర్తింపు శిబిరాలు ఈనెల 26 నుంచి 29 వరకు నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించనున్నట్టు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సంబంధిత అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. 80 శాతం కంటే ఎక్కువ వికలాంగత్వం కలిగి వారికి సంబంధిత ఉపకరణాలు అందజేస్తామన్నారు. ఈ నెల 26న సాలూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో, 27న పాలకొండ, 28న పార్వతీపురం, 29న కురుపాం మండల ప్రజాపరిషత్ కార్యాలయాల వద్ద గుర్తింపు శిబిరాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ శిబిరాలు కేవలం సహాయ ఉపకరణాల గుర్తింపునకు మాత్రమే జరుగుతుందని, సదరం వైద్య ధ్రువీకరణ పత్రాలు, పింఛనులు మంజూరు కోసం కాదని ఆయన స్పష్టం చేశారు.

అధికారుల నిర్లక్ష్యం...రైతులకు శాపం

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు వర్షాలు బాగా అనుకూలించడం, ప్రభుత్వం మద్దతు ధర క్వింటాకు రూ.2,300 చొప్పున ముందస్తుగానే ప్రకటించడంతో వరి పండించిన రైతులు తమ పంట పండిందని సంతోషించారు. అయితే జిల్లా అధికారుల నిర్లక్ష్యం వైఖరి వల్ల కొనుగోలు కేంద్రాలు సకాలంలో ప్రారంభించకపోవడంతో, తమ ఆర్థిక అవసరాల నిమిత్తం ధాన్యాన్ని తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది. క్వింటాకు రూ.2300 పొందాల్సిన రైతు రూ.1700 నుంచి రూ.1800 వరకు తమ కష్టాన్ని ధాన్యం రూపంలో అమ్ముకొని క్వింటాకు 500 రూపాయల వరకు నష్టపోతున్నారు. జిల్లా అంతటా ఇదే పరిస్థితి.


సీతానగరంలో ఇతర జిల్లాలకు లారీ ద్వారా తరలిస్తున్న ధాన్యం

- దళారుల పాలవుతున్న ధాన్యం
- ఇతర జిల్లాలకు తరలిపోతున్న వైనం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

దీపావళి మరుసటి రోజు నుంచి జిల్లాలో వరి కోతలు ముమ్మరంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలో 183 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు రెండు నెలల క్రితం జిల్లా రెవెన్యూ అధికారులు ప్రకటించినప్పటికీ, నేటికీ కేవలం పార్వతీపురం మండలం పెదబొండపల్లిలో మాత్రమే కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రానున్న వారంలో పూర్తిస్థాయిలో అన్ని మండలాల్లోనూ కొనుగోలు ప్రారంభిస్తామని, ముందస్తుగా రైతు సేవ కేంద్రాల నుంచి గోనె సంచులు పంపిణీ చేస్తున్నట్లు జిల్లా అధికారులు ప్రకటించారు. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం రైతులు దళారుల నుంచి గోనె సంచులను తీసుకొని వారు ఏర్పాటు చేసిన కోత యంత్రాల సహాయంతో ధాన్యాన్ని కళ్లాల నుంచే తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలకు తరలిస్తున్నారు. ఈ ఏడాది జిల్లాలోని 93 ధాన్యం మిల్లులు సేకరణ లక్ష్యం 2.20 లక్షల మెట్రిక్ టన్నులుగా నిర్ణయించుకున్నప్పటికీ, లక్ష్యం నెరవేరేలా లేదు. ఇంతవరకు మిల్లర్ల నుంచి బ్యాంకు గ్యారంటీలు సేకరించి ధాన్యం కొనుగోలు ప్రారంభించాల్సిన అధికారులు ఈ విషయంలో తీవ్రంగా వైఫల్యం చెందడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటులో ఆలస్యం జరిగింది. దీనివల్ల మద్దతు ధర పొందాల్సిన రైతులు తమ పంటలను దళారులకు అప్పజెప్పాల్సిన దుస్థితి నెలకొంది. గత ఐదేళ్లుగా జిల్లా వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లోనూ రైతు సేవా కేంద్రాలు ఏర్పాటుతో పాటు ధాన్యం కొనుగోలుకు అనుభవం గల సిబ్బంది ఉన్నప్పటికీ అధికారులు కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో తీవ్రమైన వైఫల్యం చెందారు.

అలాగే మిల్లర్లను సమన్వయ పర్చి, వారితో సమావేశాలు నిర్వహించి, బీజీలు సేకరించడంలో కూడా తీవ్రంగా వైఫల్యం చెందారు. జిల్లాలో దాదాపు మూడు లక్షలకు పైగా మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రాగా, అందులో సగం ఇప్పటికే దళారులు కొనుగోలు చేశారని రైతులు విమర్శిస్తున్నారు. ఈ ఏడాది పంట బాగా పండినప్పటికీ, కేవలం అధికారుల నిర్లక్ష్యం, ముందస్తు సన్నహాగాలు లేకపోవడంతో కోల్పోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లాలో నెలకొన్న పరిస్థితులను గమనించి ధాన్యం కేంద్రాల ఏర్పాటును ముమ్మరం చేయాలని, మిల్లర్లను ఒప్పించి ధాన్యాన్ని కొనుగోళ్లు చేస్తే కొంతమంది రైతులకైనా మద్దతు ధర లభించి నాలుగు డబ్బులు కళ్ల చూస్తారని, అందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

బకాయిలు చెల్లించక ముందుకు రాని మిల్లర్లు

జిల్లాలో 93 ధాన్యం మిల్లులు ఉన్నప్పటికీ అందులో ఈ ఏడాది బ్యాంకు గ్యారంటీలు సమర్పించినవి కేవలం ఒకటి రెండు మిల్లులు మాత్రమే ఉన్నాయి. గత నాలుగేళ్లుగా ప్రభుత్వం మిల్లర్లకు కష్టమ్, మిల్లింగు బిల్లులు బకాయిలు ఉండడమే కారణంగా చెబుతున్నారు. ప్రతి ఏటా తమకు రావాల్సిన బకాయిలు చెల్లించకుండా అధికారులు అలవికాని హామీలతో తమ నుంచి బీజీలు సేకరించి ఆ తర్వాత మొండి చేయి చూపుతున్నారని, ఈ ఏడాది బకాయిలు చెల్లిస్తే గాని బీజీలు సమర్పించేది లేదని మిల్లర్లు తెగేసి చెబుతున్నారు. తొలి దశలో వచ్చే ధాన్యం వల్ల తేమశాతం అధికంగా ఉండడమే కాకుండా, నాణ్యత అంతగా ఉండదని, దీనివల్ల మిల్లింగ్ దిగుబడి తగ్గి తమకు నష్టాలు వస్తాయని అందుకే, వ్యూహాత్మకంగా మిల్లర్లు బ్యాంకు గ్యారంటీలు సమర్పించకుండా జాప్యాన్ని చేస్తున్నారని, కొందరు రైతులు ఆరోపిస్తున్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి : జెసి

పార్వతీపురం : జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని, ఇందుకు సంబంధించిన బ్యాంకు గ్యారంటీ (బీజీ)లను తక్షణమే అందజేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్-ఎస్ శోబిక రైస్ మిల్లర్లను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లపై రైస్ మిల్లర్లతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో రూ.168 కోట్ల మేర బీజీలు రావాల్సి ఉండగా, ఆశించినంత స్థాయిలో అందలేదన్నారు. మిల్లర్లు బిజీలు ఇవ్వడంలో జాప్యం చేసినంత మాత్రాన రైతుల నుంచి కొనుగోళ్లు నిలిచిపోవన్న సంగతిని మిల్లర్లు గుర్తెరగాలని తేల్చిచెప్పారు. తొలుతగా బీజీలు ఇచ్చిన మిల్లులకు ధాన్యాన్ని పంపుతామని, రైతులకు ఎటువంటి నష్టం జరిగేందుకు తాము సిద్ధంగా లేమని చెప్పారు. జిల్లాలో 2లక్షల 20వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేసేలా ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. ఇందుకు బిజీలు తప్పనిసరని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని అన్నారు. రైతులు నచ్చిన చోట మిల్లర్లకు అందజేసుకోవచ్చని, ఇందులో మిల్లర్లు జోక్యం చేసుకున్న, రైతులను ఇబ్బందిపెట్టినా ఉపేక్షించ బోమని తేల్చి చెప్పారు. సోమవారం నుంచి ధాన్యం సేకరణ జరుగుతుందని, ఈలోగా మిల్లర్లు బిజీలు అందజేయాల్సి ఉందని స్పష్టం చేశారు. సమావేశం లో జిల్లా వ్యవసాయ శాఖాధికారి కె.రాబర్ట్ పాల్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ శ్రీనివాసరావు, ఎల్‌డిఎం జెఎల్ఎన్ మూర్తి, బ్యాంకు అధికారులు, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలపై
26న కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి- పాలకొండ

కేంద్రం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఈనెల 26న కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడుతున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.రమణారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. కేంద్ర మూడోసారి గద్దెనెక్కిన ఎన్‌డిఎ ప్రభుత్వ విధానాల్లో మార్పులేదని చెప్పారు. ఎన్‌డిఎలో భాగస్వామిగా ఉన్న టిడిపి, జనసేన కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అదే విధానాలను అమలు చేస్తోందని దుయ్యబట్టారు. కార్మికులు, రైతులకు వ్యతిరేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని విమర్శించారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 ఇవ్వడం లేదని తెలిపారు. మరోవైపు నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయని ఆందోళన వ్యక్తంచేశారు. సుప్రీంకోర్టు చెప్పినా అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్నభోజన నిర్వాహకులను కార్మికులుగా గుర్తించడం లేదన్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, ట్రెయినీ, గౌరవ వేతనం లాంటి పేర్లతో దోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించేందుకు కుట్ర పన్నారని దుయ్యబట్టారు. ఎం.ఎస్.స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయడం లేదని చెప్పారు. ఈ నేపథ్యంలో 26న చేపట్టే ధర్నాలో కార్మికులు, రైతులు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. అలాగే ఈనెల 24న అఖిలపక్ష కార్మిక సంఘం, సంయుక్త కిసాన్ మోర్చా సంఘాల ఆధ్వర్యాన పాలకొండలో బైక్ ర్యాలీ ప్రారంభమవుతుందని, దీన్ని కూడా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో సిఐటియు నాయకులు కాద రాము, ఎ.లక్ష్మణరావు, ఎం.అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

కిశోరి బాలికలను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని కిశోరి బాలికలను సంపూర్ణ ఆరోగ్య వంతులుగా తీర్చిదిద్దాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. వారు మానసికంగా, శారీరకంగా పరిపూర్ణ మహిళగా ఎదిగితేనే అన్ని రకాలుగా ఆరోగ్యకరమైన భావితరాన్ని, సమాజాన్ని అందివ్వగలరని ఆయన అభిప్రాయపడ్డారు. కిశోరీ వికాసంపై జిల్లా స్థాయి శిక్షకుల శిక్షణా కార్యక్రమం మహిళాభివద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని పిజిఆర్ఎస్ మందిరంలో జరిగింది. ఈ కార్యక్రమానికి సబ్ కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ బాలిక దశ నుంచి మహిళ దశకు పరిణితి చెందే దశను కిశోరి బాలికలుగా పరిగణించడం జరుగుతుందన్నారు. ఈ వయసు బాలికల్లో శారీరకంగా, మానసికంగా, సామాజికంగా అనేక మార్పులను ఎదుర్కోవలసి ఉంటుందని, వారు అన్ని రకాలుగా ఆరోగ్యకరంగా ఉంటేనే రేపటి తరం, సమాజం అన్ని రకాలుగా ఆరోగ్యకరంగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ వయస్సు బాలికలకు శారీరక, మానసిక స్థితిపై ఖచ్చితంగా అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే జిల్లాలో రక్తహీనత, నిరక్షరాస్యత, బాల్య వివాహాలు, సికిల్ సెల్, గర్భిణీలు పౌష్టికాహార లోపం తదితర సమస్యలు ఉన్నాయని, వాటిపై అవగాహన కల్పించి వాటి పట్ల జాగ్రత్తలు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన వారు మండల, గ్రామ స్థాయిలో శిక్షణలు అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారి ఎంఎన్ రాణి, డిసిపిఒ సత్యనారాయణ, సెర్ప్ ఐసిడిఎస్, విద్య, ఇంటర్మీడియట్ విద్య, వైద్య ఆరోగ్యం, పంచాయతీ రాజ్, ఇతర శాఖాల అధికారులు, సిబ్బంది, ఎన్జీఓలు తదితరులు పాల్గొన్నారు.


అడవితల్లి విగ్రహానికి పాలాభిషేకరం చేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు

అడవితల్లికి పాలాభిషేకం

అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల నిరసన

ప్రజాశక్తి -పార్వతీపురం

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మూడు రోజులుగా స్థానిక ఐటిడిఎ ఎదుట దీక్షలు చేస్తున్న గిరిజన గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు శుక్రవారం అడవి తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. తమ సమస్యలు పరిష్కారమయ్యేలా చూడాలని అడవి తల్లిని వేడుకొన్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనాలు వచ్చేలా దీవించాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్ కుమార్, ఎస్ ఎఫ్ ఐ నాయకులు రాజు, అఖిల్, గిరిజన విద్యార్థి సంఘం నాయకులు సురేష్, ట్రైబల్ రైట్స్ ఫోరమ్ నాయకులు లోవరాజు, రామకష్ణ, గిరిజన అభ్యుదయ సంఘం నాయకులు చంద్ర శేఖర్, దుక్క సీతారాం తదితరులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన గురుకుల పాఠశాల, కళాశాల ఉపాధ్యాయుల, అధ్యాపకుల డిమాండ్లు నెరవేర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తు పోరాటాలకు మద్దతు ఉంటుందని ప్రకటించారు. కార్యక్రమంలో అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయ, అధ్యాపక సంఘం నాయకులు దివాకర్, రమేష్,వెంకట్, జగదీశ్, మురళి, తిరుపతి రావు, శ్రీను, జ్యోతి, ఉమా, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : గిరిజన గురుకుల ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయ అధ్యాపకులు న్యాయమైన డిమాండ్లు పరిష్కారం కోరుతూ స్థానిక ఐటిడి ముఖద్వారం వద్ద రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి మూడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఔట్సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు అధ్యాపకులను క్రమబద్ధీకరణ చేస్తూ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు గణేష్, ధర్మారావు, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనతపై ఉద్యమిస్తున్నాం : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం



ప్రాంతీయ సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్

జిల్లాలో రక్తహీనతను అధిగమించేందుకు ఉద్యమిస్తున్నామని కలెక్టర్ ఎ.శ్యామ్‌కుమార్ తెలిపారు. ఛత్తీస్‌ఘడ్‌లోని రాజధాని రాయపూర్‌లో కేంద్ర ప్రభుత్వ పరిపాలనా సంస్కరణలు, ప్రజా సమస్యల విభాగం, సుపరిపాలన విధానాలపై నిర్వహిస్తున్న ప్రాంతీయ సదస్సులో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సదస్సుకు రాష్ట్రం నుంచి పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ మాత్రమే హాజరయ్యారు. ఈ సదస్సులో ఉత్తర ప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్ ఘర్, అస్సాం, పంజాబ్, మేఘాలయ తదితర రాష్ట్రాల నుండి జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో చేపడుతున్న రక్తహీనత నివారణ కార్యక్రమం (ప్రిజం 10) పై ఈ సదస్సులో కలెక్టర్ వివరించారు. జిల్లాలో రక్తహీనత సమస్యపై జిల్లా యంత్రాంగం చేపడుతున్న చర్యలను వివరించారు. ఈ ప్రాజెక్టు పట్ల సదస్సులో పాల్గొన్న అధికారులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలియజేశారు. అలాగే జిల్లాలో చేపడుతున్న పర్యాటక అభివృద్ధి, జీవనోపాధి కార్యక్రమాలు, స్వచ్ఛ సుందర పార్వతీపురం, మన బడి మన తోట తదితర కార్యక్రమాలను వివరించారు.

టిడిపి ప్రభుత్వం 'సూపర్' మోసం

మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడానికి రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపు చేయకుండా ప్రభుత్వం సూపర్ మోసం చేసిందని మాజీ డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర విమర్శించారు. శుక్రవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం కంటే టిడిపి ప్రభుత్వం రూ.15వేల కోట్లు మాత్రమే ఎక్కువగా బడ్జెట్ ప్రవేశపెట్టిందని చెప్పారు. దీనిలో ఎస్సీ, ఎస్టీ, బిసి జనాభాకు అనుగుణంగా బడ్జెట్లో కేటాయింపుల్లేవన్నారు. ఎస్టీ జనాభా ఆరు శాతం వుంటే బడ్జెట్‌లో కేవలం 2.56 శాతం మాత్రమే కేటాయించినట్లు తెలిపారు. ఎస్సీ, బిసీలకు కూడా బడ్జెట్లో కేటాయింపులు బాగా తగ్గించారని చెప్పారు. ఎన్నికల ముందు టిడిపి కూటమి పార్టీలు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలుకు సంబంధించి కేటాయింపులు లేవన్నారు. అంతేకాకుండా 2014 నుంచి 2019వరకు టిడిపి ప్రభుత్వ హయాంలో అమలు చేసిన హామీలను కూడా అమలు చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చారని చెప్పారు. ఈ హామీ లన్నీ ఎలా అమలు చేస్తారో ప్రభుత్వం చెప్పలేదని అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి అసెంబ్లీలో అబద్ధాలను నిజాలుగా వల్లె వేస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు దాటుతున్నా ఐటిడిఎలకు రెగ్యులర్ పిఒల్లేరని చెప్పారు. గిరిజన సంక్షేమశాఖ డిడి, సూపరింటెండెంట్ వంటి కీలక పోస్టు లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఐటిడిఎలలో పరిస్థితి ఇలా ఉంటే గిరిజనుల సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని ప్రశ్నించారు. ప్రజలు వాస్తవాలు గ్రహిస్తున్నారని, తగిన సమయంలో బుద్ధి చెపుతారని రాజన్నదొర చెప్పారు .



పట్టణంలో నిరసన ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యార్థినికి న్యాయం చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రేమ పేరుతో విశాఖలో లా విద్యార్థినిపై లైంగిక దాడి చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని, ఆమెకు న్యాయం చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్ నుండి నాలుగు రోడ్ల జంక్షన్ వరకు ర్యాలీగా వెళ్లి నిరసన చేపట్టారు. ఈ ర్యాలీని ఉద్దేశిస్తూ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కె.రాజు మాట్లాడుతూ మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని, రోజురోజుకు మహిళలకు లైంగిక దాడి జరుగుతుందని, మద్యం, గంజాయి డ్రగ్స్, మాదక ద్రవ్యాలు నియంత్రించకపోవడం వల్లే ఇవన్నీ జరుగుతున్నాయని అన్నారు. ఇంత జరుగుతుంటే రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకుండా సనాతన ధర్మం, లడ్డు రాజకీయాలు తీసుకొస్తోందని,మహిళలకు రక్షణ కల్పించడంలో మాత్రం స్పందించడంలేదని విమర్శించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు అఖిల్, జిల్లా కమిటీ సభ్యులు శివ, పార్వతీపురం టౌన్ కార్యదర్శి డేవిడ్, సభ్యులు సంజీవ్, సాయి, పలువురు విద్యార్థులు పాల్నొన్నారు.

జాతీయ హ్యాండ్‌బాల్ క్రీడలకు గిరిజన విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

68వ హ్యాండ్ బాల్ అండర్-14 బాలుర, బాలిక విభాగంలో జాతీయ స్థాయికి మండలంలోని కొత్తగూడ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరిక చరణ్ ఎంపికయ్యాడు. ఈనెల 25 నుంచి 29 వరకు చత్తీస్గఢ్‌లోని మహా సముంద్‌లో జరగనున్న జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొంటున్నట్లు ఫిజికల్ డైరెక్టర్ మాధవరావు తెలిపారు. చరణ్ జాతీయ స్థాయికి ఎంపిక కావడం పట్ల హెచ్ఎం నాగరాజు, డిప్యూటీ వార్డెన్ రవ్వల రమేష్ అభినందించారు.


జాతీయ పోటీలకు ఎంపికైన చరణ్


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాత్సవ

రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించాలి : పిఒ

ప్రజాశక్తి -పార్వతీపురం

జిల్లా స్థాయి క్రీడా, సాంస్కృతిక పోటీల్లో గెలుపొందిన విజేతలు రాష్ట్ర స్థాయిలో జరగబోయే పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాలని ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాత్సవ ఆకాంక్షించారు. భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి నేపథ్యంలో జన్ జాతీయ గౌరవ దివాస్ కార్యక్రమంలో భాగంగా పార్వతీపురం ఐటిడిఎ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రీడా, సాంస్కృతిక పోటీలు జరిగాయి. అందులో భాగంగా వాలీబాల్, జావలింగ్ త్రో, ఆర్చరీల్లో విజేతలుగా ఎంపికైన 28 మంది విజేతలకు శుక్రవారం ఆయన కార్యాలయం వద్ద పిఒ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఈ నెల 23న విశాఖ పట్నంలో జరగనున్న రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో గెలుపొంది పతకాలతో తిరిగిరావాలని ఆశీర్వదించారు. 24న జరగబోయే రాష్ట్రస్థాయి సాంస్కతిక కార్యక్రమాలకు 33 మంది విద్యార్థినులు, 22 మంది గిరిజన కళాకారుల బృందం పాల్గొంటున్నట్లు చెప్పారు. అలాగే 25న రాష్ట్రస్థాయిలో జరుగు వ్యాసరచన, పెయింటింగ్, ఎలక్యూషన్ పోటీలకు 9 మంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొంటారని తెలియజేసినారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అందరు విద్యార్థిని, విద్యార్థులకు పీఓ ఆల్ ది బెస్ట్ తెలియజేశారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - సాలూరు


ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న వ్యవసాయ కార్మిక, గిరిజన సంఘాల నాయకులు

ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ, ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేయాలని, గిరిజనులకు భూమిని పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం, ఆదివాసీ గిరిజన సంఘాలు డిమాండ్ చేశాయి. బొబ్బిలి మండలం, పంచాయతీ నిమ్మలపాడు రెవెన్యూ పరిధిలోగల డికెటి పట్టా భూములను శుక్రవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు గెమ్మెల జానకీరావు స్థానిక గిరిజనులతో కలిసి పరిశీలించారు. వారిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి గేమ్మెల జానకీరావు మాట్లాడుతూ గిరిజనులు సాగులో ఉన్న ప్రభుత్వ భూములను సాలూరు మండలం బాగువలసకు చెందిన ఇద్దరు వ్యాపారులు ఆక్రమించడం అన్యాయమని అన్నారు. సాగులో ఉన్న భూములను యంత్రాలతో సుమారు పది ఎకరాలు భూమిని చదును చేయడం సరిహద్దు రాళ్లు వేసి స్వాధీనం చేసుకోవాలనుకోవడం సరికాదని చెప్పారు. గిరిజనుల సాగులో ఉన్న భూములపై జీడి చెట్లను తొలగించడం చెరువుకు నీరు వచ్చే కాలువను పూడ్చివేయడం సరికాదన్నారు. గిరిజనులపై దౌర్జన్యం చేస్తూ సాగు చేస్తున్న ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ, ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కొయ్యకొండవలస గిరిజనులకు భూములు అప్పగించాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ ఉన్నతాధికారులు సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిచో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం మండల కమిటీ సభ్యులు పొట్టి రాము, బడన్న రమణయ్య, అప్పారావు రామన్న దొర, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మూడు నెలల పింఛను బకాయి చెల్లింపు

ప్రజాశక్తి - పార్వతీపురం

ఎన్ టి ఆర్ భరోసా పింఛను పథకం కింద 3 నెలల బకాయిల చెల్లింపునకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు సంబంధిత అధికారులతో శుక్రవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. పింఛన్ల పంపిణీ వ్యవధిలో అందుబాటులో లేనివారు, పింఛను తీసుకోని పింఛనుదారులకు 3 నెలల వరకు పింఛను బకాయిలు చెల్లిస్తున్నట్టు చెప్పారు. బకాయిల చెల్లింపు నవంబర్ నుంచి అమల్లోకి వస్తుందని ఆయన తెలిపారు. డిసెంబర్ 1 నుంచి విడుదల అవుతుందన్నారు. పింఛనుదారు ఏదైనా కారణం చేత పింఛను తీసుకోకపోతే, అది తాత్కాలిక వలసగా పరిగణించడం జరుగుతుందనిచెప్పారు. ఎవరైనా పింఛనుదారు ఒక నెలలో పింఛను (తాత్కాలిక వలస) తీసుకోకపోతే, ఒక నెల బకాయితో పాటు రెండో నెల పింఛను విడుదల అవుతుందని, రెండో నెలలో కూడా పింఛను తీసుకోని పక్షంలో మూడో నెల పింఛను కూడా విడుదల చేయనున్నారని ఆయన వివరించారు. పింఛనుదారులు 3నెలలు వరుసగా పింఛను తీసుకోక పోతే శాశ్వత వలసగా పరిగణించి వారి పింఛను నిలిపివేస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుత నిబంధనలపై పింఛనుదారులకు అవగాహన కల్పించాలని ఆయన ఆదేశించారు. అందరు ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు పింఛను పంపిణీని పర్యవేక్షించాలని సూచించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలోని పెదబొండపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక అన్నారు. శుక్రవారం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఆమె నిర్వాహకులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో అన్ని మండలాల్లోనూ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు చేపట్టామని, పెద్ద బొండపల్లి కేంద్రం ద్వారా ఇప్పటికీ 500 క్వింటాలు ధాన్యాన్ని రైతుల నుంచి సేకరించగా అందులో చాలామంది రైతులకు 48 గంటల్లోగా ధాన్యానికి సంబంధించిన నగదును వారి ఖాతాలో జమ చేశామని, మిగతా వారికి కూడా సోమవారంలోగా చెల్లింపులు జరుగుతాయని తెలిపారు. రైతులు దళారుల బారిన పడకుండా కాస్త ఆలస్యమైనప్పటికీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కేంద్రాలను వినియోగించుకుని మద్దతు ధరను పొందాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఎఒ అశోక్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాలంటీర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

గ్రామ, వార్డు వాలంటరీల సమస్యలు పరిష్కరించాలని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలు అమలుచేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శ యమ్మల మన్మధరావు, కోశాధికారి జి.వెంకటరమణ, ఉపాధ్యక్షులు వి.ఇందిర డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యంగా వాలంటీర్లు గత రెండు నెలల వేతనాలు పెండింగ్ ఉన్నాయని తెలిపారు. వాటిని ఇవ్వాలని ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అధికారంలోకి వచ్చిన వెంటనే వాలంటీర్లకు రూ.10వేలు ఇస్తామని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారని, ఆ హామీని నెరవేర్చే దిశగా అడుగులు వేయాలని డిమాండ్ చేశారు. బలవంతంగా రాజీనామా చేసిన వాలంటీర్లను విధులకు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చి వాలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

గోకులం షెడ్ల నిర్మాణాలు పరిశీలన

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలో నిర్మాణం జరుగుతున్న గోకులం షెడ్ల పనులను ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధిహామీ నిధులతో మంజూరు చేస్తూ రైతులకు షెడ్ల నిర్మాణానికి రాయితీ కల్పిస్తుందని అన్నారు. కావున పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని గోకులం షెడ్లను శరవేగంగా నిర్మించాలని అన్నారు. కార్యక్రమంలో ఎపిఒ పి.బావాజీ, జెఇ నారాయణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో ఇంటింటి సర్వే

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

గ్రామీణ అభివృద్ధి పంచాయతీ రాజ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు కొత్తగా ఏర్పాటు చేసిన స్వర్ణ గ్రామ పంచాయతీ వెబ్‌సైట్‌లో రాష్ట్రం మొత్తం ఉన్న గ్రామ పంచాయతీలన్నీ వాటి టాక్స్ అండ్ నాన్ టాక్స్ వివరాలు ఈనెల 30లోగా వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేయాలనే సూచనల మేరకు గ్రామాల్లో సర్వే చేపడుతున్నట్లు కేదారిపురం గ్రామ సచివాలయం కార్యదర్శి బిడ్డిక సురేష్ తెలిపారు. ప్రతి పంచాయతీలో రివిజన రిజిస్టర్ అప్డేషన్, 2024-25 డిమాండ్ రిజిస్టర్, ఫీల్డ్ వెరిఫికేషన్ పనిలో ఉన్నట్లు ఆయన తెలిపారు. ఇంటింటి సర్వే, జియో ట్యాగింగ్‌తో పాటు సంక్షేమ సర్వేలు నిర్వహిస్తున్నామని అన్నారు. సమగ్ర నివేదిక చేసి ప్రభుత్వానికి అందిస్తామని అన్నారు.

పెదగొత్తిలిలో గ్రామసభ

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో పెదగొత్తిలి పంచాయతీ గ్రామ సచివాలయంలో సర్పంచ్ తాడంగి లోకనాథం అధ్యక్షతన శుక్రవారం ఉపాధి హామీ గ్రామసభను నిర్వహించారు. ఉపాధిహామీ చట్టంలో జాబ్ కార్డులు మార్పులు, కొత్త జాబ్ కార్డులు మంజూరు, మరణించిన వారి పేర్లు తొలగింపు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డు లేనటువంటి వారు జాబు కార్డు దరఖాస్తు చేసుకుంటే ఉపాధి సిబ్బంది కార్డు అందజేస్తారని, దీంతో పనికి వెళ్లడానికి అవకాశం ఉంటుందని అన్నారు. కావున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంటి, ఫీల్డ్‌అసిస్టెంట్లు లక్ష్మో, సమర్రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని 17 ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి ఈ ఏడాది 30వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు లక్ష్యం పెట్టుకున్నామని మండల వ్యవసాయాధికారి జె. సౌజన్య తెలిపారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మండలంలోని ఈ ఏడాది 16,100 ఎకరాల విస్తీర్ణంలో వరి పంట సాగైందన్నారు. ఆడారు 5, పనస నందివాడ30, హుస్సేన పురం 60 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు ధాన్యం సిద్ధంగా ఉన్నట్లు ఆమె తెలిపారు. మండలంలోని చిన్న, సన్నకారు రైతులు 10,800 మంది రైతులు ఉన్నారని, 10,500 వరకు రైతులు ఇ- క్రాప్ చేసుకున్నట్లు ఆమె తెలిపారు. ధాన్యం కొనుగోలు విషయంలో ఎటువంటి అపోహాలు ఉన్నా సంప్రదించాలని ఆమె రైతులను కోరారు.

నేలపాలైన తారు

ప్రజాశక్తి -మక్కువ

మండలంలోనిమార్కొండ పుట్టి, కన్నంపేట పరిసర ప్రాంతాల్లో రహదారి పనుల కోసం వినియోగించాలని తీసుకొచ్చిన ఆరు తారు డబ్బాలను గుర్తు తెలియని వ్యక్తులు బోర్లించడంతో తారు మొత్తం నేలపాలైందని కాంట్రాక్టర్ ఎం.లక్ష్మణరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్అండ్‌బి రోడ్లు మరమ్మతుల కోసం తెచ్చి ఉంచిన కారు డబ్బాలు నేలపాల కావడంతో ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఇప్పటికే పెట్టుబడులు పెట్టి బిల్లుల కోసం ఎదురుచూస్తున్న తమకు ఇలాంటి నష్టాలు మరిన్ని ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరితగతిన మరమ్మతులు పనులు చేయాలనుకుంటున్న ఇలాంటి ఆటంకాలు ఎదురవు తున్నాయి అన్నారు

జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేయండి

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

జిల్లాను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని స్థానిక ఎమ్మెల్యే విజయ్ చంద్ర శాసనసభలో ప్రస్తావించారు. శుక్రవారం అయిన మాట్లాడుతూ తోటపల్లి జలాశయం ప్రకృతి నిలయంగా ఎంతో ఆకర్షణీయంగా ఉందని, అక్కడ టూరిజం అభివృద్ధి చేస్తే ఎంతో ఉపయోగమన్నారు. పార్వతీపురం పట్టణం వ్యాపారి కూడలిగా రాణిస్తుందని ఒడిశా, చత్తీస్గడ్ రాష్ట్రాలకు సరిహద్దుగా ఉందని వివరించారు. టూరిస్టులు ఈ ప్రాంతానికి వచ్చేందుకు రవాణా సౌకర్యం కూడా ఉందన్నారు. రిసార్ట్స్, ఇతర సౌకర్యాలు కల్పిస్తే టూరిజం అభివృద్ధి అయ్యి ఉద్యోగ అవకాశాలకు బాటలు వేయవచ్చని అన్నారు.

మునగ మొక్కలు పంపిణీ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కిమ్మిలో ఉపాధి హామీ చట్టం నర్సరీ ద్వారా మునగ మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు ఎపిఒ జి.సత్యంనాయుడు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆ గ్రామ సర్పంచి జి రామ్మోహన్ ద్వారా పంపిణీ కార్యక్రమం చేపట్టారు. 7వేల మొక్కలు పంపిణీకి అందుబాటులో ఉన్నాయని, ఈ మొక్కలను ప్రభుత్వ పాఠశాలలకు, కార్యాలయాలకు, అంగన్వాడీ కేంద్రాలకు, వసతి గృహాలకు, స్వయంసహాయక గ్రూపు సభ్యులకు ప్రాధాన్యమిస్తూ పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జి.తిరుపతిరావు, టెక్నికల్ అసిస్టెంట్ బి.హరిబాబు, సిసి ఎ.శ్రీనివాసరావు, కె.రామకష్ణ గ్రామస్తులు పాల్గొన్నారు.

మినీ గోకులాలు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - బలిజిపేట

మండలానికి మంజూరైన మినీ గోకులాలను తక్షణమే పూర్తి చేయాలని డ్వామా పీడీ కె.రామచంద్రరావు అధికారులను ఆదేశించారు. మండలంలోని సుభద్ర, బర్లి, పెదపెంకి గ్రామాల్లో జరుగుతున్న నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. మినీ గోకులాల నిర్మాణాలు సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఎపిఒ కె.కేశవరావు, ఇసి, సిహెచ్ శ్రీనివాసరావు, సాంకేతిక, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.



గోకులాల నిర్మాణాలను పరిశీలిస్తున్న డ్వామా పీడీ రామచంద్రరావు

నిబద్ధతో పని చేయండి

ప్రజాశక్తి - సీతానగరం

సచివాలయ ఉద్యోగులంతా నిబద్ధతతో పనిచేయాలని జిఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా నోడల్ ఆఫీసర్ రామ్ గోపాల్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు ఆధ్వర్యంలో మండల సచివాలయం ఉద్యోగులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం జరుగుతున్న హౌస్ హెూల్డ్ జియో లోకేషన్ సర్వే, ఎన్‌పిసిఐ లింకింగ్, పాఠశాల శానిటేషన్ ఇన్‌స్పెక్షన్ తదితర సర్వేలు వివిధ ప్రభుత్వ కార్యక్రమాలపై ఆయన ఆరా తీశారు. ఉద్యోగుల హాజరు, క్షేత్రస్థాయిలో వారు చేస్తున్న పనులపై సమీక్షించారు. ఈ క్రమంలో క్షేత్రస్థాయిలో సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బయోమెట్రిక్ డివైసులు సక్రమంగా పనిచేయకపోవడం వల్ల సర్వేల ఆలస్యం జరుగుతుందని, ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తదితర విషయాలు సచివాలయం ఉద్యోగులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. విధి నిర్వహణలో ఎవరూ అలసత్వం ప్రదర్శించరాదని అన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కొమరాడ : సచివాలయం ఉద్యోగులందరూ సమిష్టిగా సమన్వయంతో పని చేయాలని గ్రామ వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి బి.రామగోపాల్ తెలిపారు. మండలంలోని సచివాలయ ఉద్యోగులతో స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో బయోమెట్రిక్ డివైస్లు పనిచేయకపోవడం వల్ల సర్వేలో జాప్యం జరుగుతుందని ,తగినంత మంది సిబ్బంది లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు సచివాలయం ఉద్యోగులు వారి సమస్యలను స్పెషల్ ఆఫీసర్ దష్టికి తీసుకువచ్చారు. మీ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కారానికి తగు చర్యలు కలెక్టర్ ఆదేశాలతో తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మల్లికార్జునరావు, సచివాలయ అధికార్లు తదితరులు పాల్గొన్నారు.



సీతానగరంలో సచివాలయ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతున్న నోడల్ అధికారి



నిరసన తెలుపుతున్న గిరిజన రైతులు

గ్రీన్‌ఫీల్డ్ హైవే బాధితులకు పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి - పాచిపెంట

గ్రీన్ ఫీల్డ్ హైవే రహదారి వల్ల గిరిజనులకు జీవనాధారమైన భూములు, అటవీ ఉత్పత్తులకు సంబంధించిన చింత, సీతాఫలాలు, కుంకుడు చెట్లు కోల్పోయిన బాధితులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని బాధిత గిరిజనులు సూకూరు అప్పన్న, గెమ్మెల చిన్నయ్య, సీతయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండలంలోని కాట్రగుడ్డి వద్ద బంగారు గుడ్డి, కాట్రగుడ్డి గ్రామ గిరిజనులు నిరసన తెలిపారు. అనంతరం సిపిఎం జిల్లా నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ గ్రీన్‌ఫీల్డ్ హైవే వల్ల గిరిజనులు కోల్పోయిన భూములకు, అటవీ ఉత్పత్తులు పరిహారం చెల్లించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల గిరిజనులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులు రెవిన్యూ పరిధిలో ఉన్న గ్రామాలను తిరిగి అవగాహన లేని గిరిజనులకు అవగాహన కలిగించి వాళ్లకు రావాల్సిన డబ్బులు గ్రీన్ఫీల్డ్ హైవే వల్ల వచ్చినవి పూర్తిస్థాయిలో వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయిలో బాధ్యత పడేలా ఉండాలన్నారు. ఈ నిర్లక్ష్యం వల్ల రెండు గ్రామాల గిరిజనులు తీవ్రంగా నష్టపోయారని, అధికారులకు తెలిపినా పట్టించుకోకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు ఈ రెండు గ్రామాలు తిరిగి హైవే పరిధిలో నష్టపరిహారం చెల్లించేలా చర్యలు చేపట్టాలని, లేకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. బాధిత గిరిజన రైతులు చెన్నయ్య, సీతయ్య మాట్లాడుతూ తమకు ఎటువంటి అవగాహన లేకపోవడం వల్ల సర్వం కోల్పోయామని, అధికారులు, కలెక్టర్ స్పందించి తమకు న్యాయం చేయాలని తెలిపారు.

విడివికె నిధుల దుర్వినియోగంపై దర్యాప్తు ఏమైంది : సిపిఎం

ప్రజాశక్తి - కొమరాడ

వన్ దన్ వికాస్ కేంద్రాలకు సంబంధించి నిధులపై వెలుగు ఎపిడి వై.సత్యంనాయుడు గురించి అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఒక్క అడుగు దర్యాప్తు ముందుకు వెళ్లని పరిస్థితి ఉందని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి అన్నారు. కొమరాడలో విలేకరులతో ఆయన మాట్లాడారు. తమ ఫిర్యాదులు పరిశీలించాక ఆ అధికారిపైన ఎటువంటి తప్పుల్లేవు, నిధులు సక్రమంగా వినియోగించారు కావున రిటైర్ అయ్యేదాకా ఇక్కడే ఉద్యోగం చేస్తారని అధికారులు ఆయనకు భరోసా ఇచ్చారా? లేక ఇంకేమైనా రాజకీయ నాయకులు ఒత్తిడి ఉందానని ప్రశ్నించారు. గతంలో తనతో పాటు మండల టిడిపికన్వీనర్ శేఖర్ పాత్రుడు, నాయకులు నీరస శ్రీనివాసరావు గ్రీవెన్స్‌లో కలెక్టర్, ఐటిడిఎ పిఒకు ఫిర్యాదు చేసినా స్పందించలేదన్నారు. ఇప్పటికైనా వెలుగు ఎపిడి వై.సత్యంనాయుడు పనిచేసిన కాలంలో ప్రభుత్వం నుండి వచ్చిన నిధులపై దర్యాప్తు చేపట్టి వాస్తవాలు బయట పెట్టాలని డిమాండ్ చేశారు.

మత్స్యకారుల సమావేశం

ప్రజాశక్తి - భామిని

మండలంలోని బాలేరులో శ్రీరామ మత్స్యకార సహకార సంఘం పాలకవర్గ సమావేశం శుక్రవారం నిర్వహించారు. మత్స్యకారులకు పిఎంఎంఎస్‌వి ఫింగర్లింగ్స్ టాకింగ్ పథకం ద్వారా చేప పిల్లలు సరఫరా చేసేందుకు చర్చించుకున్నారు. ఉపాధిహామీ పథకం ద్వారా బాలేరు వారి చెరువు, నులకజోడు మామిడి చెరువులను క్యాప్టివ్ సీడ్ నర్సరీ క్యాపిటల్ సీట్ నర్సరీగా మార్చేందుకు నిర్ణయించారు. బోరు బావులు తవ్వడానికి సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమంలో మత్స్య సహాయకులు కె.ఆదినారాయణ, మత్స్య కారులు పాల్గొన్నారు.

రహదారుల పనుల్లో నాణ్యత పాటించాలి

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని శంబర పోలమాంబ ఆలయ సమీపంలో రూ.2.40కోట్లు అంచనా విలువతో చేపడుతున్న రోడ్డు పనుల్లో నాణ్యత లోపించకుండా చూడాలని ఎంపిడిఒ డిడి స్వరూపరాణి సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. శుక్రవారం ఆమె రోడ్డు పనులను పరిశీలించి, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధి హామీ పథకం ప్రత్యేక గ్రామ సభలో పాల్గొని జాబ్ కార్డులు పరిశీలించారు. మరణించిన వారి జాబ్ కార్డులు తొలగించాలని ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. సిలబస్ త్వరగా పూర్తి చేయాల్సిందిగా హెచ్‌ఎంకు సూచించారు. మధ్యాహ్న భోజన పథకం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - సాలూరు

యువకులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని టౌన్ సిఐ బి.అప్పలనాయుడు కోరారు. శుక్రవారం పిఎఫ్ బొడ్డవలస సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థుల కు సంకల్పం కార్యక్రమంలో భాగంగా మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. సరదా కోసం సారా, గంజాయి, గుట్కాలకు అలవాటు పడితే భవిష్యత్తు నాశనమవుతుందన్నారు. స్మార్ట్ ఫోన్లతో ఎక్కువ సమయం గడపకుండా ఉన్నత లక్ష్యం వైపు పయనించాలని సూచించారు. మత్తుపదార్థాలు తరలించినా, అలవాటు పడినా కేసులు నమోదు చేస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలోని దోనుబాయి గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దోనుబాయి ఎస్సై షేక్ మస్తాన్ సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం ఫిర్యాదు బాక్సులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుకుమార్, డిప్యూటీ వార్డెన్ సుబ్బారావు, పిడిఆర్‌సి రెడ్డి, పోలీసులు రాంబాబు తదితరులు ఉన్నారు.

కొమరాడ : ప్రతి ఒక్కరికి విద్యార్థి దశ చాలా కీలకమని, ఆ దశలో విద్యార్థులు మంచి మార్గాల్లో నడవాలంటే సత్ప్రవర్తనతో మెలగాలని ఎస్సై నీలకంఠం అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంకల్పం అవగాహన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు చట్టాలపైనా, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సైబర్ క్రైమ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించే ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో సత్ప్రవర్తనతో ఉంటే భవిష్యత్తులో ఉన్నత స్థానానికి వెళ్లేందుకు ఎందుకు అవకాశం ఉందన్నారు. కావున చదువుకునే సమయంలో సెల్‌ఫోన్‌కు ఎంత దూరంగా ఉంటే వారి భవిష్యత్తు బాగుంటుందని అన్నారు. ఆన్లైన్ గేములు, బెట్టింగ్లు తదితర నిషేధిత యాప్‌లను వినియోగించకుండా వారికే అవగాహన కల్పించారు. సైబర్ క్రైమ్‌లో బాధితులు నష్టపోయి ఇబ్బందులను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.



సాలూరులో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిఐ అప్పలనాయుడు

పనిగంటల పెంపును ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి - సీతంపేట

పాఠశాలల పని గంటల పెంపుపై ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం శాసన మండలిలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలని యుటిఎఫ్, పిఆర్‌టియు, ఎస్‌టియు, ఎపిటిఎఫ్, ఎంటిబి, ఎంఎల్‌ఇ ఉపాధ్యాయు సంఘాలు తీవ్రంగా ఖండిస్తూ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం శాసనమండలిలో ప్రవేశ పెట్టిన హైస్కూల్ పనిగంటలను 5గంట వరకు పనిచేయాలన్న తీర్మానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా పరిధిలో సుమారు 65 వివిధ విద్యా సంస్థలున్నాయని, ఈ పాఠశాలల్లో ఎక్కువ మంది విద్యార్థులు గ్రామీణ ప్రాంతాలలో నుంచి హాజరవుతున్నారన్నారు. వీరు స్వగ్రామాలకు సకాలంలో బస్సు, ఇతర వాహన సౌకర్యాల్లేవన్నారు. కావున ఈ కాలమానాన్ని ఉపాధ్యాయులు సంఘాలగా వ్యతిరేకిస్తున్నాయన్నారు. ప్రకటన విడుదల చేసిన వారిలో యుటిఎఫ్ గౌరవ అధ్యక్షులు ఎ.భాస్కరరావు, జిల్లా కార్యదర్శి కె.కృష్ణారావు, మండల అధ్యక్షులు కె.ఆనందరావు, మండల ప్రధాన కార్యదర్శి బి.పకీరు, ఎస్‌టియు అధ్యక్ష కార్యదర్శులు పి.పురుషోత్తం, పి.రాజారావు, కె.ప్రమోద్, ఎంటిబి, ఎంఎల్‌ఇ రాష్ట్ర కార్యదర్శులు సవర డొంబు, ఎస్.ఆనంద్ ఎల్లంగో, మహిళా విభాగం చంద్రకళ ఎం భారతి తదితరులు ఉన్నారు..

స్త్రీనిధి లక్ష్యం రూ.3కోట్లు : ఎజిఎం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని మహిళా సంఘాల సభ్యులు స్త్రీనిధి నిధులు సద్వినియోగం చేసుకోవాలని ఎజిఎం కె.హేమలత కోరారు. స్థానిక ఐకెపి కార్యాలయానికి వచ్చిన ఆమె విలేకరులతో మాట్లాడారు. మండలంలో రూ.3కోట్లు శ్రీనిధి లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటి వరకు రూ.కోటీ 80లక్షలు రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. ఎటువంటి డాక్యుమెంటరీ లేకుండా శ్రీనిధులు మహిళలకు ఇస్తున్నట్లు చెప్పారు. శ్రీనిధులు తీసుకున్న మహిళలకు ఇన్సూరెన్స్ సౌకర్యం కూడా బ్యాంకు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఏ సందర్భంలోనైనా అనుకోకుండా మరణిస్తే ఆ కుటుంబానికి బీమా అందజేస్తున్నట్టు తెలిపారు. తక్కువ వడ్డీతోనే శ్రీనిధులు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. శ్రీనిధులపై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

టెన్త్ విద్యార్థులకు 29న గ్రాండ్ టెస్ట్

ప్రజాశక్తి - బలిజిపేట

ఈనెల 29న మండలంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేకంగా గ్రాండ్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు ఎంఇఒ-1 సామల సింహాచలం తెలిపారు. శుక్ర వారం ఆయన స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని హై స్కూళ్లకు స్పెషల్ ఆఫీసర్లను నియమించి ప్రత్యేక పర్యవేక్షణ చేయిస్తున్నారని అన్నారు. ఇటీవల నిర్వహించిన ఎఫ్ఎ-2 పరీక్షల్లో పదో తరగతి విద్యార్థుల మార్కుల ప్రగతిని ఎంఇఒ పరిశీలించారు. టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించేందుకు ఇప్పటినుండే కష్టపడి చదవాలన్నారు. ఈనెల 29న జరిగే గ్రాండ్ టెస్ట్ చక్కగా రాయాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.శ్రీనివాసరావు, ఉపాధ్యా యులు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ను అందజేస్తున్న శ్రీనివాసరావు

పేద విద్యార్థులకు పూర్వ విద్యార్థి బాసట

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థి మద్ది శ్రీనివాసరావు తన జన్మదినాన్ని పురస్కరించుకొని మెరిట్ ఉన్న పేద విద్యార్థులకు ఒక్కో తరగతికి ఇద్దరు చొప్పున 16 మంది పిల్లలను ఎంపిక చేసి స్కాలర్‌షిప్‌లు ఇస్తున్నారు. శ్రీనివాసరావు తన తోటి విద్యార్థులకి స్ఫూర్తిదాయకంగా ఉంటూ తన ఊరికి, తను చదువుకున్న స్కూల్‌కి ఏదో ఒకటి చేయాలని, ప్రతి ఒక్క విద్యార్థి కూడా ఈ రకంగా ఆలోచించాలని సర్పంచి బొత్తాడ గౌరీ శంకర్రావు అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కిషోర్, స్కూల్ చైర్మన్ సొంటేన రాజేష్, గ్రామ పెద్ద గుడ్ల హరిప్రసాద్ , మద్ది దొరబాబు, ఉపాధ్యాయులు బర్నికల మురళి ధర్, కూర్మారావు , ఇన్చార్జి హెచ్‌ఎం త్రినాధ్, విద్యార్థులు పాల్గొన్నారు.

నీలకంఠాపురంలో పల్లె సందర్శన

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని నీలకంఠాపురంలో ప్రత్యేక అధికారి కె.ప్రసాదరావు శుక్రవారం పల్లె సందర్శన నిర్వహించారు. పల్లెనిద్రలో భాగంగా స్థానిక గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో రాత్రి బస చేసి, ఉదయం అంగన్వాడీ కేంద్రాలు, సచివాలయాలు, గ్రామంలో వీధులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె సందర్శనతో గ్రామాల్లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎ.మన్మథరావు, పిహెచ్‌సి అభినవ్ కుమార్ పాల్గొన్నారు.

ఆధారాల సేకరణ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఎల్విన్‌పేటలో శుక్రవారం రాత్రి రమేష్ పాత్రో పాన్ షాపులో జరిగిన దొంగతనానికి సంబంధించి పార్వతీపురం క్రైమ్ స్పాట్ క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. ఫింగర్ ప్రింట్ బ్యూరో ఎస్ఐ తేజస్వరూప్ షాపు మొత్తం పరిశీలించి వేలిముద్రలను సేకరించారు. షాపు యజమానిని దొంగతనం జరిగిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎల్విన్ పేట సిఐ హరి, ఎస్ఐ శివప్రసాద్ ఉన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - సాలూరు

కూటమి ప్రభుత్వం మున్సిపాల్టీల్లోనూ, కార్పొరేషన్లలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ విభాగంలోని, వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులందరికీ రిస్క్ అలవెన్స్ ఇవ్వాలని, పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు స్థానిక మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు, ఇంజనీరింగ్ విభాగాల అధ్యక్షులు డర్రు సంతోష్, ఉమా, అమర్ కుమార్ మాట్లాడుతూ అక్టోబర్ నెల వేతనాలు నేటికీ కార్మికులకు చెల్లించలేదని, దీంతో పండగ పూటల్లోనూ కార్మిక కుటుంబాలు పస్తులతో ఉన్నాయన్నారు. రానున్న క్రిస్మస్, సంక్రాంతికి కూడా వేతనాలు ఇవ్వకుంటే మరిన్ని అప్పులపాలు కావాల్సి ఉంటుం దని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంపై ఎన్నో ఆశలతో ఉన్నామని, ఇంజినీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచి పెండింగ్ లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు.



ప్రార్థన సమయాన్ని పరిశీలిస్తున్న డిఇఒ తిరుపతినాయుడు

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

ప్రజాశక్తి - కురుపాం

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డిఇఒ ఎన్.తిరుపతినాయుడు సూచించారు. మండలంలోని జి.శివడ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత బాలుర పాఠశాలను శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరిశీలించి అనంతరం రాబోయే వార్షిక పరీక్షలను దృష్టిలో ఉంచుకొని ప్రతి విద్యార్థి శ్రద్ధగా చదవాలని సూచించారు. అనంతరం పాఠశాలలో పలు రికార్డులను పరిశీలించి, సిబ్బందితో మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంతో పాటు పాఠశాల పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

హై స్కూల్‌ను సందర్శించిన ఎంపిడిఒ

గుమ్మలక్ష్మీపురం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంపిడిఒ సాల్మన్ రాజు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల తరగతుల బోధన, విద్యార్థుల సామర్థ్యం పరిశీలించారు. రానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు ఇప్పటి నుంచే కష్టపడి చదవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బిడ్డిక భీముడు, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

మంత్రి రాజీనామా చేయాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

శాసనమండలిలో మహిళ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి సవిత తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని మాజీ ఎమ్మెల్యే వి.కళావతి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడారు. వైసిపి ప్రభుత్వంలో డిబిటి డబ్బు ద్వారా మహిళలు గంజాయి, మద్యానికి బానిసలయ్యారని మంత్రి సవిత చేసిన వ్యాఖ్యలపై కళావతి మండిపడ్డారు. తక్షణమే మంత్రి సవిత రాష్ట్ర మహిళలకు క్షమాపణ చెప్పాలని కోరారు. ఒక మహిళా మంత్రిగా ఉండి రాష్ట్ర మహిళా పట్ల ఇంత నీచంగా మాట్లాడడం సమంజసం కాదన్నారు. రాష్ట్ర మహిళలకు వెంటనే క్షమాపణ చెప్పి తన పదవికి రాజీనామా చేయాలని కళావతి డిమాండ్ చేశారు.

'ఆయుష్'పై ఆశాలకు శిక్షణ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఆయుష్ ద్వారా ఆరోగ్య సంరక్షణ, సాధారణ వ్యాధులు, మధుమేహం నియంత్రణపై ఆశా కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్నట్టు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ టి.హేమాక్షి అన్నారు. ఆయుష్ శాఖ కమిషనర్ ఉత్తర్వులు మేరకు శిక్షణకు సంబంధించిన షెడ్యూల్‌ను జిల్లా వైద్యారోగ్యశాఖకు సమర్పించామన్నారు. ఈ మేరకు బందలుప్పి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ ఎన్ఎంకె తిరుమల ప్రసాద్ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలకు శుక్రవారం ఆయుష్ శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణలో డాక్టర్ హేమాక్షి మాట్లాడుతూ ప్రాచీన ఆయుర్వేద వైద్య విధానం ద్వారా అనేక దీర్ఘకాలిక రుగ్మతలను తగ్గించవచ్చని, ఇందుకు అనేక ఆయుర్వేద ఔషధాలు ఉన్నాయని వివరిస్తూ ఆహారపు అలవాట్లు, జీవన విధానాలను కూడా ఇందుకు అనుగుణంగా మార్చుకోవడం ద్వారా అనేక రుగ్మతలకు దూరంగా ఉంచవచ్చని, రోగనిరోధక శక్తి బలపడుతుందని పేర్కొన్నారు. శిక్షణకు సంబంధించి ఆయుష్ శాఖ పంపిణీ చేసిన పుస్తకాలు, బ్రోచర్లను వైద్యాధికారి ద్వారా ఆశాలకు అందజేశారు. ఆశా కార్యకర్తల ద్వారా క్షేత్ర స్థాయిలో ఆయుష్ వైద్య విధానంపై, మెరుగైన ఆరోగ్యానికి ఆయుర్వేదం ఆవశ్యకతపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని ఆయుష్ శాఖ ఈ నిర్ణయం తీసుకుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు శ్రీరాములు నాయుడు, నాగమ్మ, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

ప్రత్యేక తరగతులు నిర్వహించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని పాలకొండ డిప్యూటీ డిఇఒ పి.కృష్ణమూర్తి సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని కంబర వలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం సందర్శించారు. రాబోయే పదో తరగతి పరీక్షల్లో విద్యార్థుల శాతశాతం ఉత్తీర్ణత అయ్యేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం ఉపాధ్యాయ సిబ్బంది హాజరు పట్టికను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వై.లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అపరాల సాగులో మెలకువలపై అవగాహన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని అంటిపేటలో అపరాల సాగులో మెలుకువల కోసం రైతు శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌సి (జిల్లా శిక్షణా కేంద్రం) సహాయ వ్యవసాయ సంచాలకులు ఆర్.శ్రీనివాసరావు, వ్యవసాయ సహాయ సంచాలకులు భారతి అపరాల పంటపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అపరాల విత్తుకునే ముందు థైరం, కాప్టాన్‌తో విత్తన శుద్ధి చేయాలని, వరి పంట కోతకు 10 రోజుల ముందు విత్తనాల విత్తుకోవడం వల్ల మొలక శాతం ఎక్కువగా ఉంటుందని, అపరాలు విత్తిన మడిలో నీటి నిల్వ ఉండకుండా చూసుకోవాలని, అపరాలకు ఏదైన పురుగు ఆశిస్తే వేప నూనె, కషాయం పిచికారీ చేసుకోవాలన్నారు. దీనివల్ల పురుగును సమర్థవంతంగా నివారించవచ్చన్నారు. అపరాల లో ఎక్కువ గా వచ్చే బూడిద తెగులు నివారణకు గంజి ద్రావణం పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎఒ ఎస్.అవినాష్, విఎఎలు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.